అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది లాలాపేట, విజపురి కాలనీ, చిలకలగూడ, విజయపురి కాలనీల్లోని అదనపు అంతస్తుల నిర్మాణాలను తొలగించారు.

లాలాపేటలో అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని లాలాపేట శ్రీపురికాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన బహుళ అంతస్తును బుధవారం టౌన్‌ప్లానింగ్ ఆఫీసెస్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం కూల్చివేసింది. ఈ సందర్భంగా డీసీపీ బాలశ్రీనివాస్ మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



డిప్యూటీ డీఈవో శ్రీధర్‌తో డాక్టర్ మంచాల శ్రీనివాసులు

పద్మారావునగర్: విద్యాభివృద్ధికి విద్యా సంస్థలు నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు చేపట్టాలని సికింద్రాబాద్ జోన్ విద్యాశాఖ డిప్యూటీ డీఈవో శ్రీధర్ అన్నారు. బుధవారం బోలక్‌పూర్ శ్రీ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు డిప్యూటీ డీఈవో శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ మెరుగైన విద్యాబోధన ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. సేవా దృక్పథంతో విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

నేడు పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈనెల 24న (నేడు) పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1974లో ఓయూలో పీడీఎస్‌యూ ఆవిర్భవించిందని ఈ సందర్భంగా క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సభకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

మహంకాళి దేవాలయ హుండీ ఆదాయం రూ.12.58లక్షలు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయ అమ్మవారికి హుండీ ద్వారా రూ.12,58,724 ఆదాయం లభించింది. బుధవారం దేవాలయంలో భక్తులు, అధికారుల సమక్షంలో అమ్మవారి హుండీని లెక్కించగా కానుల రూపంలో ఈ ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, సహాయ కమిషనర్ కృష్ణ, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కామేశ్వర్, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు కేఎం కృష్ణ, ప్రకాష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిపై భక్తితో కానుకలు సమర్పించిన భక్తులకు ఈఓ మనోహర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తంను ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి అందచేసి, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యను పరిశ్రమలతో అనుసంధానం చేయాలని వారిని ఆయన కోరారు.

బీసీ కులగణన చేపట్టడం హర్షణీయం

అంబర్‌పేట: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టడం సామాజిక న్యాయానికి దోహదపడుతుందని ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి శాలువతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ బోర్డు వైస్‌చైర్మన్ నాగభూషణం, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చందుపటేల్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.39, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 35, బెండకాయ 60, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 38, పందిరి బీర 55, క్యాబేజీ 25, క్యారెట్ 47, దొండ 40, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 80, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 35, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 37, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 19, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కంటోన్మెంట్‌లో ప్రజాస్వామ్యానికి పాతర

ఎమ్మెల్యే శ్రీగణేశ్

- తక్షణమే బోర్డు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్
- 153 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణ లక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో ప్రజాపాలనకు కేంద్రం పాతర వేసిందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నాలుగేళ్లుగా బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా, కేంద్రం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. బుధవారం కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని సంజీవయ్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో 153 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో స్థానిక పాలన అధ్వానంగా ఉందన్నారు. కంటోన్మెంట్‌లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో వార్డుల వారీగా మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చిన్నపాటి సమస్యల పరిష్కారానికి సైతం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో రెండు రోజులకోసారి మంచినీటి సరఫరా జరుగుతుండగా, కంటోన్మెంట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలుగైదు రోజులకోసారి నీటి సరఫరా జరిగేదన్నారు. ఈ నేపథ్యంలో తాను సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అదనపు నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం కంటోన్మెంట్‌కు చెల్లించాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు రూ.900 కోట్లకు చేరడం దారుణమన్నారు. త్వరలోనే తాను రక్షణ శాఖ ఉన్నతాధికారులను కలిసి సర్వీసు చార్జీల బకాయిల విడుదల చేయాలని కోరనున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కోరుతామన్నారు.

సంక్షేమాభివృద్ధికి ప్రాధాన్యం

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గత పాలకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేశారన్నారు. రాష్ట్రంలో అవినీతిని పెంచి పోషించి ఆక్రమణదారులకు రాష్ట్రాన్ని అడ్డాగా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలనే కృతనిశ్చయం ప్రజా పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్, కాంగ్రెస్ నేతలు జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, బంగారు సదానంద్, సంజీవయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డీఎం అశోక్ కుమార్,యాదవరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



లాలామీయ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: నియోజకవర్గ పరిధిలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. బుధవారం ఆయన 7వ వార్డు లాలామీయ బస్తీలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోరా ముస్లింలకు చెందిన స్కూల్ వెనుక నుంచి డ్రైనేజీ పైప్‌లైన్ పనులు సాఫీగా జరిగేందుకు బోరా ముస్లిం సోదరులు సహకరించాలని కోరారు. అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేందుకు సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికులు పలు సమస్యలు తన దృష్టికి తీసుకవచ్చారని బస్తీలో నెలకొన్న సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని హామీ చ్చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మురళి ముదిరాజ్, నాగినేని సరిత. బస్తీవాసులు పాల్గొన్నారు.

ఓయూ వీసీకి వినూత్న కానుక అందజేత



వీసీకి గిఫ్ట్‌ను అందజేస్తున్న డా.ఐలయ్యయాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు యూనివర్సిటీ క్యాంపస్ టెక్నాలజీ కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్. సాదం ఐలయ్యయాదవ్ వినూత్న కానుకను అందజేశారు. వీసీ విద్యాభ్యాసం మొదలు ఉద్యోగం, బోధన, పరిశోధన, చేపట్టిన పదవులు, అవార్డులు తదితర అనేక అంశాలను ప్రస్తావిస్తూ ఇద్దరి ఫొటోలతో ఫ్రేం కట్టించి ప్రొ.కుమార్‌కు అందించి అభినందనలు తెలిపారు.

ఓయూ వీసీకి వినతుల వెల్లువ..

ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం వినతులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులతో పాటు విద్యార్థి సంఘాల నేతలు, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందనలు, సన్మానాలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దీంతోపాటు వివిధ సమస్యలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేస్తున్నారు.



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

క్రైం కార్నర్..

తల్లీకుమారుడి అదృశ్యం



తల్లీకుమారుడు

చిలకలగూడ : తల్లీకుమారుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ సరళ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ ఐమాత ఆలయ ప్రాంతానికి చెందిన సురేశ్, శర్వాణీ భార్యభర్తలు. వీరికి ఏడాదిన్నర వయస్సు గల కుమారుడు మోక్షిత్ ఉన్నాడు. ఈనెల 22న సాయంత్రం 5.30 గంటలకు శర్వాణీ కుమారుడితో కలిసి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో పరిసర ప్రాంతాలతో పాటు, సన్నిహితులు, బంధువుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో సోదరుడు రామారావు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


యువతి అదృశ్యం



మహాలక్ష్మి

చిలకలగూడ : యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ కింది బస్తీకి చెందిన మహాలక్ష్మి (23) సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో జాబ్ చేస్తోంది. ఈనెల 22న ఉదయం 11.30 గంటలకు బయటకు వెళ్లిన మహాలక్ష్మి తిరిగి ఇంటికి రాలేదు. సంస్థలో అడిగితే జాబ్‌కు రాలేదని చెప్పారు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. సన్నిహితులు, బంధుమిత్రుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో తల్లి ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, ఆచూకీ తెలిస్తే చిలకలగూడ ఠాణాలో లేదా ఫోన్ నంబరు 8712661252కు సమాచారం అందించాలని ఎస్ఐ సబిత కోరారు.

కూరగాయల కోసం వెళ్లి..



రామ్‌జతన్

చిలకలగూడ : వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ దర్భాంగా శివనగర్‌కు చెందిన రామ్ జతన్ చౌపాల్, పింకీదేవి భార్యభర్తలు. నగరానికి వలసవచ్చి మెట్టుగూడ డివిజన్ దూద్ బావిలో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. రామ్‌జతన్ (33) సికింద్రాబాద్ స్వాతి హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 18న మధ్యాహ్నం 2 గంటలకు కూరగాయలు తెస్తానని బయటకు వెళ్లిన రామ్‌జతన్ తిరిగి ఇంటికి చేరలేదు. స్వస్థలంలోపాటు స్వాతిహోటల్ పరిసర ప్రాంతాల్లో వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో భార్య పింకీదేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ జ్ఞానేశ్వర్ కోరారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు



ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: ఆరోగ్య సమస్యల నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో మెరుగైన వైద్యం పొందాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్ట జేలైన్‌కు చెందిన మాధవి చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్ఓసీని తన నివాసంలో ఆయన అందజేశారు. మాధవి గత కొంత కాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశ్రయించగా ఆయన చొరవతో రూ.3 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం ఎల్ఓసీని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌కు వెలుగొచ్చింది



'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం



మాణికేశ్వర్‌నగర్‌లో వెలుగుతున్న వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధి మాణికేశ్వర్‌నగర్‌లో కొన్నిరోజులుగా వీధి దీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో 'చీకట్లు ఇక్కట్లు!' శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మాణికేశ్వర్‌నగరలోని ఫేజ్–2లోని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానిక బీజేపీ నాయకులు భానుక చరణ్ రాజ్, బస్తీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న రంగరాజన్

రాంగోపాల్‌పేట్: హిందూ దేవాలయాలు, దేవుళ్లపై దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా చట్టాలను సవరించాలని చిలూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగ రాజన్ అన్నారు. బుధవారం ఆయన కుమ్మరిగూడ ముత్యాలమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారిపై దుండగుడి చేసిన దాడి అమానుషమన్నారు. భయం, భక్తి లేనందునే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న సమయంలో పోలీసులు ఐపీసీ 295 కింద కేసు నమోదు చేస్తారని దాని కింద రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుందన్నారు. పంజాబ్‌లో ఈ చట్టాన్ని సవరించారని అలాగే ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టం చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మించొద్దు

లాలాపేట : అభివృద్ధి పేరుతో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మించడం తగదని బహుజన రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాకాల దానియేలు అన్నారు. దళిత సంఘాల నేతలతో కలిసి బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల మనోభావాలను దెబ్బతినేలా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బహుజన రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శి తాటికొండ అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైద్యులను నియమించాలి



లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం

లాలాపేట: లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను నియమించాలని సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన దవాఖానను సందర్శించి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలల తరబడి ఈ హాస్పిటల్‌కు మెడికల్ ఆఫీసర్, చిల్డ్రన్స్ డాక్టర్ లేరన్నారు. స్కానింగ్, ఎక్స్‌రే, ల్యాబ్ టెక్నీషియన్స్ అందుబాటులో లేకపోవడంతో రోగులు వెనుదిరగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ ఎస్ఆర్ హాస్పిటల్ సమీపంలో రోడ్డు పనులను సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 30 లక్షల వ్యయంతో పనులు చేపట్టామని త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. ఇదిలా ఉండగా కార్పొరేటర్ సీసీ రోడ్డు పరిశీలిస్తున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకుని నిర్మాణ పనులను తామే ప్రారంభిస్తామని కాంగ్రెస్ నాయకుడు జలంధర్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టడంతో కార్పొరేటర్ అనుచరులు, కాంగ్రెస్ నాయకుల మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. తమ పార్టీ అధికారంలో ఉందని రోడ్డు పనులు ప్రారంభిస్తామని కాంగ్రెస్ నాయకులు, పనులు ప్రారంభించే అధికారం ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు ఉంటుందని బీఆర్ఎస్ నాయకులు కాసేపు వాదించుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు జాకీర్, శైలేందర్, ఆనంద్, అక్రం, ఫజిల్, ఖలీమ్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ డీఎస్పీ జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయిశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడిని రైల్వే పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయిశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 21న రైల్వేస్టేషన్ 10 నంబర్ ప్లాట్‌ఫామ్ సమీపంలో రాత్రి 10 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వేలిముద్రల ఆధారంగా మృతుడు గుజరాత్‌కు చెందిన నిసాద్ రామ్‌సనై (37)గా నిర్ధారించారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన నిసాద్‌రామ్‌సనై బన్సీలాల్ పేట్, బొల్లారం ప్రాంతంలో రెండు నివాసాలను ఏర్పాటు చేసుకున్నాడు. రైల్వేలో ప్రైవేట్ కూలీగా పనిచేసిన నిసాద్‌రామ్‌సనై అలియాస్ కన్నడరాజు నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో జరిగిన ఆర్థిక నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. దాడులు చేయడం, బెదిరించడం, డబ్బులు లాక్కోవడం వంటి నేరాలకు పాల్పడుతూ జీవించేవాడు. హత్య జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు నిసాద్‌రామ్‌సనైని హత్య చేసిన వ్యక్తి మధ్యప్రదేశ్‌కు చెందిన సుభాష్‌బహేశ్వర్ (39)గా గుర్తించారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన సుభాష్ బహేశ్వర్ లాలాగూడ ప్రాంతంలో నివాసం ఉంటూ రైల్వేలో సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నిసాద్‌రామ్‌సనై పలుమార్లు సుభాష్‌బహేశ్వర్‌పై దాడులకు పాల్పడి నగదును లాక్కునేవాడు. హత్యకు రెండు రోజుల ముందు సుభాష్ బహేశ్వర్ జీతం డబ్బులను నిసాద్‌రామ్‌సనై లాక్కుని దాడి చేశాడు. అంతేగాకుండా ధైర్యం ఉంటే 10వ నంబర్ ప్లాట్‌ఫామ్ వద్దకు వచ్చి తనను ఓడిస్తే డబ్బు తిరిగి ఇస్తానని సుభాష్ బహేశ్వర్‌కు సవాల్ విసిరాడు. దీంతో అక్కడికి వెళ్లగా తనను ఎందుకు హింసిస్తున్నావు..? తన జీతం డబ్బులు ఎందుకు లాక్కుంటున్నావని నిలదీయగా వాగ్వాదం జరిగింది. దీంతో ఆవేశంలో సుభాష్‌బహేశ్వర్ కర్రతో నిసాద్‌రామ్ తలపై కొట్టగా తీవ్ర గాయమై మృతిచెందాడు. హంతకుడు సుభాష్‌బహేశ్వర్‌ను సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.